క్లుప్తంగా

మత్స్య అవతారంలో జగన్నాథస్వామి



పాలకొండ: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జగన్నాథస్వామి మత్స్య అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం దాస్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



కూరగాయల అలంకరణతో గాయత్రీ అమ్మవారు

పాలకొండ: పట్టణంలోని గాయత్రీ దేవి ఆలయంలో వారాహి గుప్త నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి చిట్టిబాబు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి యజ్ఞ, యాగాదులు నిర్వహించి దీక్షలు చేపట్టారు. ఇందులో భాగంగా గాయత్రీ అమ్మవారిని ప్రతి రోజు కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఈ నెల 15 వరకు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతాయని అర్చకులు తెలిపారు.

ఎరువుల పంపిణీ

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర, గరుగుబిల్లి, పెద్దూరు, సంతోషపురం, గొట్టివలస, శివ్వాం, రావివలస తదితర గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు డీఏపీ, యూరియా వంటి ఎరువులు మంగళవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో ఆర్.విజయభారతి కోరారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ అక్కేన వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకు గుర్తింపుకార్డులు



మాట్లాడుతున్న ఉపతహసీల్దార్ లక్ష్మీకుమార్

గరుగుబిల్లి: కౌలురైతులకు గుర్తింపుకార్డులు అందజేయడం జరుగుతుందని ఉపతహసీల్దార్ పి.ఎస్.లక్ష్మీకుమార్ తెలిపారు. మండలంలోని నాగూరులో కౌలురైతులతో మంగళవారం సామావేశమైన ఆయన ఈ గుర్తింపుకార్డుల ద్వారా రైతులకు ఇస్తున్న మాదిరి రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పండిన పంటలను ప్రభుత్వం ప్రకటించిన ధరకు విక్రయించుకునే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వో బాలబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో పరివర్తన

- రాష్ట్ర సహిత విద్య కో ఆర్డినేటర్ డాక్టర్ అమ్మినాయుడు



గుమ్మలక్ష్మీపురం భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న సహితవిద్య రాష్ట్ర కో ఆర్డినేటర్ అమ్మినాయుడు

గుమ్మలక్ష్మీపురం: ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల్లో అందజేసే ఫిజియోథెరపీతో పరివర్తన లభిస్తుందని సహిత విద్య రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ అమ్మినాయుడు అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక అవసరాల పిల్లలకు అందిస్తున్న ఫిజియోథెరపీని పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అన్ని సదుపాయాలతో ప్రతీ మంగళవారం భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. భవిత కేంద్రానికి 12 కిలోమీటర్లలోపు ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలు తప్పనిసరిగా భవిత కేంద్రానికి వచ్చేలా చూడాలని సహిత ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం భవిత కేంద్రంలోని రికార్డులు తనిఖీచేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలతో కొంత సేపు ముచ్చటించారు. ఆయన వెంట పార్వతీపురం మన్యం జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ భానుమూర్తి, ఎంఈఓ బి.చంద్రశేఖర్, సహిత ఉపాధ్యాయులు సురేష్, వై.విజయలక్ష్మి ఉన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

వీరఘట్టం: స్థానిక సాయినగర్ కాలనీ, బార్నాలవీధిలకు చెందిన శ్మశానవాటికలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి రాము ఆధ్వర్యంలో శ్మశాన వాటికలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు.

సాగు సులభం.. రైతుకు లాభం

- డ్రమ్‌సీడర్ వినియోగంతో బహుళ ప్రయోజనాలు
- సమయం, సాగు ఖర్చు ఆదా
- కలుపు, చీడపీడల నివారణ సులభం



డ్రమ్‌సీడర్‌తో వరి విత్తనాలు వేస్తున్న రైతు

పాలకొండ రూరల్: వ్యవసాయంలో యంత్ర పరికరాల వినియోగంతో కూలీల కొరతను అధిగమించడంతో పాటు సమయం, సాగు ఖర్చును ఆదా చేసుకోవచ్చు. అలాగే శారీరక శ్రమ పెద్దగా అవసరం లేకుండానే సాగు చేయవచ్చు. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు సులభతర వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా వరి విత్తనాలు వేసేందుకు డ్రమ్‌సీడర్లను వినియోగిస్తున్నారు. వీటి వినియోగం వల్ల బహుళ ప్రయోజనాలు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు, రైతులు అంటున్నారు.

డ్రమ్‌సీడర్ వాడకం ఇలా..

- వరి సేద్యానికి 15 రోజుల ముందు పొలాన్ని దమ్ము చేసి విత్తనాలు వేసుకునేందుకు సిద్ధం చేయాలి.
- విత్తనాలు వేసేందుకు నాలుగు రోజుల ముందు మరోమారు దమ్ము చేపట్టి నీరు నిలువ లేకుండా చూడాలి. పొలాన్ని సమానంగా చదును చేసుకోవాలి.
- బురద పదునులో రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల దూరంలో కాలువలు ఏర్పాటు చేయాలి.
- ఎంపిక చేసుకున్న వరి విత్తనాలను 24 గంటలు నీటిలో నానబెట్టిన తరువాత మరో 24 గంటలు గోనె సంచిలో ఉంచాలి. ఎకరానికి విత్తన రకాన్ని బట్టి 12 నుంచి 16 కిలోల విత్తనాలు అవసరమవుతాయి.
- మొలకెత్తిన విత్తనాన్ని పొలంలో పలుచటి నీటి పొర ఉంచి సమానంగా డ్రమ్ సీడర్ పరికరంలో వేసి విత్తుకోవాలి. మొక్కలు మొదటి ఆకు పూర్తిగా పురి విప్పుకునే వరకు (7 నుంచి 10 రోజులు) ఆగాక తగిన మోతాదులో తడులు అందించాల్సి ఉంటుంది.

పెట్టుబడి తక్కువ



డ్రమ్ సీడర్ వినియోగంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. తక్కువ పెట్టుబడి, నీటితో పంట సేద్యానికి తోడ్పడుతుంది. చీడ, పీడల నుంచి చేనుకు రక్షణ కలుగుతుంది. ముఖ్యంగా వ్యవసాయంలో సమయం, వేతనదారుల వినియోగం ఘననీయంగా తగ్గుతాయి. గ్రామీణ వ్యవసాయ సహాయకుల ద్వారా డ్రమ్ సీడర్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– కె.రత్నకుమారి, వ్యవసాయశాఖ ఏడీ, పాలకొండ

- ఈ విధానంలో కలుపు నివారణ కోసం విత్తిన 8 నుంచి 10 రోజుల్లో ఎకరానికి 25 కేజీల ఇసుక వంతున సిద్ధం చేసి అందులో బుటాక్లోర్, సేఫనర్స్ 1.25 మిల్లీ లీటర్లు లేదా ఆక్సాడయార్జిల్ 35 గ్రాములు కలిపి పొలమంతా పలుచటి పొరలా చల్లాల్సి ఉంటుంది.
- మొలకెత్తిన 20 నుంచి 25 రోజులకు కలుపు మొక్క నివారణకు లీటరు నీటికి 2.5 గ్రాముల ఫెర్నాక్సోన్(డిసోడియం లవణం) వార్షిక గడ్డి కలుపు మొక్కల నివారణకు వాడుకోవాల్సి ఉంటుంది. లేదా ఎకరాకు 400 మిల్లీలీటర్లు సైథాలో పాప్‌బ్యూటైల్ మందును నీటిలో కలిపి కలుపు మొక్కలపై పిచికారీ చేయాలి.
- వ్యవసాయాధికారులు సిఫార్స్ చేసిన భాస్వరం, పొటాష్ ఎరువులను ఆఖరి దమ్ములో వేసి కలియదున్నాలి. మిగిలిన ఎరువులు చివరి దశలో వేసుకుంటే మేలు. అలాగే అధికారుల సూచనల మేరకు నత్రజని మూడు సమ భాగాలుగా చేసి విత్తిన 15-35-60 రోజుల వ్యవధిలో బురద నీరు పూర్తిగా తీసివేసిన తరువాత వేయాల్సి ఉంటుంది.

అధిక ప్రయోజనం

డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేయడం ద్వారా పైరు వరుస క్రమంలో ఎదుగుదలకు వస్తుంది. ఈ విధానం వలన సూర్యరశ్మి, గాలి చేనుకు బాగా అందుతుంది. అలాగే చీడపీడలు బెడద తగ్గుతుంది. ముఖ్యంగా దోమపోటు బెడద అధిగమించవచ్చు. సస్యరక్షణకు అయ్యే ఖర్చు కూడా మిగులు తుంది. నారు వేసే పద్ధతితో పోల్చుకుంటే 10 రోజులు ముందుగానే పంట కోతకు వస్తుంది. పెట్టుబడి కూడా 15శాతం వరకు ఆదా అవుతుంది.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి

పాలకొండ రూరల్: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించటం ద్వారా రోడ్డు ప్రమాదాలను అదుపు చేయవచ్చని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా మంగళవారం రోడ్డు భద్రతపై, నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వరాదన్నారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న ప్రమాదాలకు వాహన యజమానే పూర్తి బాధ్యులన్నారు. నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలని, ప్రమాదలు సంభవిస్తే క్షతగాత్రులకు సహకరించాలన్నారు. ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పల్లా మునిస్వామి, ఎం.వెంకటేశ్వరారావు, మరిచర్ల జగన్మోహనరావు, నరసింగరావు, రాంబాబు, వెంకటరమణ, గోవిందరావు, కె.వెంకటరావు, చందక జగదీష్‌కుమార్, నల్లి శివప్రసాద్, కనపాక సూర్యప్రకాష్ తదితరులున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

పాలకొండ రూరల్: వాహన చోదకులు నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పాలకొండ ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళం రహదారిలో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోందని, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ద్విచక్ర వాహన చోదకులు కచ్చితంగా హెల్మెట్లు ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. ఆటో, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు కచ్చితంగా నిబంధనలు పాటించాలని, అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పారిశుద్ధ్యంపై దృష్టిసారించండి

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశమైన ఆయన.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు తాగు నీటి వనరుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు కూడా ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు పాల్గొన్నారు.

కౌలురైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

వీరఘట్టం: నేటి నుంచి మూడు రోజుల పాటు కౌలురైతులకు గుర్తింపు కార్డుల మంజూరు కోసం అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తహసీల్దార్ కె.జయప్రకాష్ మంగళవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈనెల 10న తలవరం, పనసనందివాడ, కుమ్మరిగుంట, నీలానగరం, తెట్టంగి, వీరఘట్టం, చిన్నగోర, పెద్దూరు, బూరుగ, చలివేంద్రి, జె.గోపాలపురం రెవెన్యూ గ్రామాల్లో, ఈనెల 11న దశుమంతపురం, సంత-నర్సిపురం, నడుకూరు, కొట్టుగుమ్మడ, గడగమ్మ, కిమ్మి, వండవ, అడారు, బిటివాడ, బియ్యంవలస, డెప్పివలస, తూడి, పీవీఆర్ పురం, చిదిమి, యు.వెంకమ్మపేట, పాలమెట్ట గ్రామాల్లో, ఈనెల 12న బొడ్లపాడు, రేగులపాడు, కొంచ, హుస్సేనుపురం, కత్తులకవిటి, ఎం.రాజపురం, కుంబిడి, చిట్టపులివలస, విక్రమపురం, శ్రీహరిపురం, మొదటికెల్ల, కడకెల్ల, నడిమికెల్ల, కంబర రెవెన్యూ గ్రామాల్లో సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేంద్రియ వ్యవసాయంతో మేలు



గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్న వెలుగు ప్రతినిధులు

భామిని: మండలంలోని మూలగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్లు నాగేష్, చిరంజీవిరావు ప్రకృతి వ్యవసాయ విధానంలో వినియోగించే బీజామృతం, వివిధ కషాయాలను ఎలా తయారు చేస్తారో వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల సాగు ఖర్చు పెరిగిపోవడంతో పాటు భూసారం దెబ్బతింటుందని, ఫలితంగా పంట దిగుబడులు తగ్గిపోయి రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. సేంద్రియ వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో మేలైన పంట దిగుబడులు పొందవచ్చన్నారు.

అన్నప్రసాదం పంపిణీ



గర్భిణులకు అన్నప్రసాద ప్యాకెట్లు అందిస్తున్న సేవాసమితి సభ్యులు

పాలకొండ రూరల్: సత్యసాయి సేవాసమితి సభ్యులు మండలంలోని అన్నవరం పీహెచ్‌సీలో మంగళవారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా గర్భిణీలకు అన్నప్రసాదం ప్యాకెట్లు అందించారు. ఆధ్యాత్మిక వక్త ఎన్‌వీ రమణ సద్గుణ సూక్తులను వివరించారు. భగవాన్ శ్రీసత్యసాయి మార్గం అనుసరనీయమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వంద మందికి అన్నప్రసాదం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సేవాసమితి సహకారంతో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రెల్ల నుంచి కొత్తవలస గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం భూమిపూజ చేశారు. రూ.1.45 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 1.5 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో రోడ్డు నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిడ్డిక పద్మ, జమ్మయ్య, జనసేన పార్టీ కురుపాం ఇన్‌చార్జ్ కె.మల్లేశ్వరరావు, దుమ్మంగి సర్పంచ్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత విధిగా పాటించాలి



పరిసరాల పరిశుభ్రతపై సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి సంతోషిలక్ష్మి

భామిని: స్థానిక కేజీబీవీలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి డాక్టర్ వి.సంతోషిలక్ష్మి నేతృత్వంలో వైద్యుల బృందం విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. సీహెచ్‌ఓ సీహెచ్.భాస్కరరావు, సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, నెలసరి సమస్యలపై సూచనలు చేశారు. జ్వర లక్షణాలున్న విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. సిక్ రూంలో అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో అంటురోగాలు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కేజీబీవీ సిబ్బందికి సూచించారు.

ఉపాధి పనుల్లో పారదర్శకతకే సామాజిక తనిఖీలు


- డ్వామా పీడీ కె.రామచంద్రరావు



ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న డ్వామా పీడీ రామచంద్రరావు, ఇతర అధికారులు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో మరింత పారదర్శకత పాటించేందుకే సామాజిక తనిఖీలు నిర్వహించడం జరుగుతోందని డ్వామా పీడీ కె.రామచంద్రరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీలకు సంబంధించి ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనులతో పాటు ప్లాంటేషన్, ఎవెన్యూ ప్లాంటేషన్, నిర్మాణాలకు సంబంధించి తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. సామాజిక తనిఖీ బృందం పర్యవేక్షణలో లోపాలు గుర్తించిన చోట సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో పాటు రికవరీ చేయడం జరుగుతుందన్నారు. పలు పంచాయతీల్లో వేతనదారులు వేలిముద్రలు వేయకుండా, సంతకాలు పెట్టకుండా వేతనాలు తీసుకున్నట్లు, పనుల్లో కొలతల్లో తేడాలున్నట్లు ఆడిట్ బృందం గుర్తించిందన్నారు. పండ్లతోటల పెంపకానికి వేసిన మొక్కలు పంటపొలాల్లో లేనట్లుగా కూడా గుర్తించారన్నారు. బీపీపురం, గరుగుబిల్లి, రావుపల్లి తదితర గ్రామాల్లో మృతి చెందిన పింఛన్‌దారుల పింఛన్ నగదు డీబీటీ ద్వారా విడుదలైనట్లు కూడా గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఏపీడీ జి.శ్రీహరిరావు, ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఏపీవోలు ఎం.గౌరీనాథ్, టి.రామకృష్ణనాయుడు, ఎస్ఆర్‌పీ బి.దాసు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మెడికల్ క్యాంపు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సత్యం

సీతంపేట: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈఓపీఆర్డీ కొండపల్లి సత్యం అన్నారు. మండలంలోని కుడ్డపల్లి గ్రామ సచివాలయం పరిధిలో పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. బావుల్లో క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించారు. అలాగే కుడ్డపల్లి నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపు పర్యవేక్షించారు. ఈ ఎపిడమిక్ సీజన్‌లో మలేరియా, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి నిధుల మంజూరు

వీరఘట్టం: మండలంలోని బిటివాడ పీహెచ్‌సీలో అదనపు భవనం నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.56 లక్షలు మంజూరైనట్లు ఆర్అండ్‌బీ డీఈఈ బి.గౌరీశ్వరరావు మంగళవారం తెలిపారు. అదనపు భవన నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం సమీపంలో బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రి వైద్యనిపుణులతో ఆరోగ్య తనిఖీలు, పరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వారాల సందడి

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, శివ్వాం తదితర గ్రామాల్లో వారాల సందడి నెలకొంది. ఖరీఫ్ పనుల ప్రారంభానికి ముందు ఇలా గ్రామదేవతలకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా గరుగుబిల్లిలో పాదాలమ్మకు, శివ్వాంలో రేగాలమ్మకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డప్పువాయిద్యాల నడుమ ఘటాల ఊరేగింపు చేపట్టారు.

దోమల నివారణకు చర్యలు

సీతంపేట: మలేరియా నివారణకు ఈనెల 15 నుంచి మండలంలో 35 గ్రామాల్లో ఐఆర్ఎస్ దోమల నివారణ మందును పిచికారీ చేయనున్నట్టు మలేరియా నివారణ సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోనుబాయి, మర్రిపాడు, కుశిమి పీహెచ్‌సీల పరిధిలో పలు గ్రామాల్లో ఏసీఎం 5 శాతం ద్రావణాన్ని పిచికారీ చేయనున్నట్టు తెలిపారు.

శిలాఫలకం ధ్వంసం



పిట్టలమెట్ట వద్ద దుండగులు విరగ్గొట్టిన శిలాఫలకం

గరుగుబిల్లి: మండల పరిధిలోని పార్వతీపురం-శ్రీకాకుళం రోడ్డులో పిట్టలమెట్ట వద్ద రోడ్డు నిర్మాణానికి సంబంధించి, ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అభివృద్ధి పనుల కోసం ఆవిష్కరించిన వాటిని కూడా కూలదోస్తే ఎలా అని అటువైపుగా వెళ్తున్న జనం అనుకుంటున్నారు. ఇది టీడీపీ నాయకులు, కార్యకర్తల పనేనని పలువురు అనుకుంటున్నారు. ఏది ఏమైనా ఇలా చేయడం సరికాదని ఖండిస్తున్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న ఉపతహసీల్దార్ రాజేంద్ర

గుమ్మలక్ష్మీపురం: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఉపతహసీల్దార్ రాజేంద్ర హెచ్చరించారు. మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయంలో పీవో సీహెచ్ సుశీలాదేవి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు, పేదరికం, అవగాహన లేని కారణంగా బాల్యవివాహాలు జరుగుతుంటాయని, అయితే బాల్యవివాహాలు చేయడం సరికాదన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని, బాల్యవివాహాలు అడ్డుకోవడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చురుగ్గా వ్యవహరించాలని సూచించారు.

వాహన తనిఖీలు



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు

కురుపాం: వాహనచోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ షణ్ముఖరావు సూచించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ పెట్రోల్‌బంకు దగ్గర సిబ్బందితో కలిసి మంగళవారం వాహన తనిఖీలు చేపట్టిన ఆయన.. అటువైపుగా వస్తున్న వాహనదారులను ఆపి, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. వాహనాలతో రోడ్డుమీదకు వచ్చేటప్పుడు లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యంతాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

రాయితీపై ఎరువుల పంపిణీ



ఎరువులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గౌరీశంకర్

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద రాయితీపై డీఏపీ, యూరియా వంటి ఎరువులను రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సబ్సిడీపై అందిస్తున్న వీటిని తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకరరావు కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గణపతి, అగ్రికల్చర్ అసిస్టెంట్ సాయిప్రభ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయరూ..?



బురదమయమైన కొమరాడ అంతర్ రాష్ట్ర రహదారి

కొమరాడ: స్థానికంగా ఉన్న అంతర్ రాష్ట్ర రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఒడిశాతో పాటు మరో మూడు రాష్ట్రాలకు వెళ్లే ఈ రోడ్డు అధ్వానంగా తయారైందని, దీంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్డంతా బురదమయమవుతోందని, అలాంటి సమయంలో ఈ రోడ్డు మీదుగా వెళ్తున్న చిన్నచిన్న వాహనాలు బురదలో కూరుకుపోయి నిలిచిపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే అయినా ఈ సమస్యను పట్టించుకుని, పరిష్కరిస్తారని ఆశిస్తున్నామని అంటున్నారు.

హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్‌లపై అధికారుల ఆగ్రహం



హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్‌లను నిలదీస్తున్న ఏటీడబ్ల్యూవో, ఎంఈవో

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ గ్రామ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలురు) హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్‌లపై ఎంఈవో బి.చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో బి.సురేష్‌కుమార్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన సదరు అధికారులు.. ఆ సమయంలో హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్ లిద్దరూ పాఠశాలలో లేకపోవడంపై మండిపడ్డారు. విధులకు వచ్చి, బయటకు వెళ్లిపోవడమేంటని ప్రశ్నించారు. విద్యార్థులను సంరక్షించేది ఇలాగేనా అంటూ నిలదీశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారి తీరుపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ఎంఈవో, ఏటీడబ్ల్యూవో తెలిపారు. అనంతరం విద్యార్థుల మధ్యాహ్న భోజనం మెనూ పరిశీలించి, మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని సూచించారు.